సాక్షం-ఈసీఐ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి

ఎల్‌బీనగర్: ప్రతి ఒక్కరు జాతీయ ఎన్నికల సంఘం ప్రవేశ పెట్టిన సాక్షం–ఈసీఐ యాప్‌ను ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు.ఈ యాప్‌లో ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఈ యాప్‌లో ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి వివరాలకు 9849904226 నెంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

పాపిరెడ్డి కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం కాలనీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా టీ.శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రవినాయక్, ఉపాధ్యక్షులుగా బాలునాయక్, కోశాధికారిగా సోమయ్యగౌడ్‌లు ఎన్నికయ్యారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాట 23, వంకాయ 18, బెండ 28, పచ్చి మిర్చి 35, కాకర 20, బీర 23, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 37, దొండ 13, చిక్కుడు 35–65, గోకర 23, బీట్‌రూట్ 25, క్యాప్సికం 35, ఆలు 21, దోస 13, సొర 9, పొట్ల 15, ఉల్లిగడ్డ 40, చామగడ్డ 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్



సభకు హాజరైన గిరిజనులు

కేసీఆర్ హయాంలోనే గిరిజనుల అభ్యున్నతి

- తండాలను జీపీలు మార్చిన ఘనత సీఎందే
- సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి
- గిరిజన, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు: మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: గిరిజనులను కాంగ్రెస్, బీజేపీ ఓటు బ్యాంకుగా చూశాయే తప్ప.. వారి అభివృద్ధి, సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదని గిరిజన, మహిళాశిశు సంక్షేమ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్ ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిధిలోని తుక్కుగూడలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజన బంజారా ఆత్మీయ సమ్మేళన సభను మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలనాధికారాన్ని కల్పించారని ప్రశంసించారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేసి వృథాచేసుకోవద్దు

గిరిజనులను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేసి వృథా చేసుకోవద్దని, కారు గుర్తుకు ఓటు వేయాలని మంత్రి సబితా రెడ్డి విజ్ఞప్తి చేశారు. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయ నిర్మాణాలకు రెండు ఎకరాల స్థలం కేటాయించామని, ఇంద్రారెడ్డి ట్రస్ట్ నిధులతో ఆలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. బంజారా భవన్‌కు స్థలం కేటాయించి భవన్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయించామని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమంలో గిరిజనులకు పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని సబితారెడ్డి హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

పలు గిరిజన తండాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రుల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీఆర్‌ఎస్ గిరిజన రాష్ట్ర నాయకుడు దిప్‌లాల్ చౌహాన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు సభావత్ లచ్చానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్ పాల్గొన్నారు.



సభనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

- మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్



చిత్రలేపుట్ కాలనీలో వాకర్స్‌తో కలసి వాలీబాల్ ఆడుతున్న లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ చిత్ర లేఔట్ కాలనీ పార్క్, ఆర్‌కేపురం పార్క్, హరి పురి కాలనీ మహేశ్వర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పిట్ట హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్

మలక్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయనుందని ఆపార్టీ మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. పార్టీ సీనియర్ నేత విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మూసారంబాగ్ డివిజన్‌లో ఇందిరానగర్, సాయినగర్, పెద్దబజారు, సంజీవయ్యనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీల గూర్చి ఓటర్లకు వివరించారు. నాయకులు పోలం రవీందర్‌యాదవ్, బద్దం సురేందర్‌రెడ్డి, బోనగిరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యాకత్‌పురాలో రెండు నామినేషన్లు దాఖలు



సైదాబాద్: యాకత్‌పురా నియోజకవర్గంలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం చంపాపేటలోని సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో ఎంఐఎం నుండి జాఫర్ హుస్సేన్ మెరాజ్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుండి అనిల్ కుమార్ నామినేషన్లు దాఖలు చేసారు.

మలక్‌పేటలో ఐదు..



చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో సోమవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్‌ఓ కె.వెంకట ప్రసాద్ తెలిపారు. ఎంఐఎం నుంచి అహ్మద్ బలాల నామినేషన్ దాఖలు చేసారు. ఇండిపెండెంట్లుగా పాల్కం శ్రీనివాస్, ఎల్.అశోక్‌నాథ్, భార్గవ్, అక్రం అలీ ఖాన్‌లు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌ఓ తెలిపారు.

మూడు కేసులు నమోదు–సీఐ

పర్మిషన్ లేకుండా ఊరేగింపులో బాణాసంచా కాల్చటం, వెయ్యి బైక్‌లతో ర్యాలీ చేయడం, ట్రాఫిక అంతరాయం కల్గించడంపై ఫిర్యాదులు అందాయని వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపారు.

ఎల్‌బీనగర్‌లో తొమ్మిది..

చైతన్యపురి: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎల్‌బీనగర్‌లో నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది నామినేషన్లు రాగా అందులో బీజేపీ అభ్యర్థి సామరంగారెడ్డి, నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి చామకూర రాజయ్య రెండు సెట్‌లు వేశారు. ఆమ్ ఆద్మిపార్టీ అభ్యర్థిగా మంచాల శ్రీకాంత్ నామినేషన్ వేయగా మరోసెట్ ఇండిపెండెంట్‌గా వేశారు. సోమవారం పెండ్యాల వినోద్‌కుమార్ ఇండిపెండెంట్‌గా, ఇద్దరు మహిళలు అంజలి పాటిబళ్ల, నల్లమడుగు శోభారాణి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలు అందశారు.

బాధితులకు సెల్‌ఫోన్ అందజేసిన పోలీసులు



చైతన్యపురి: మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు చైతన్యపురి పోలీసులు వాటిని రికవరీ చేసి అందించారు. మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని వెతికి రికవరి చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నాగార్జున, డీఐ నాగరాజుగౌడ్ తెలిపారు. సోమవారం బాదితులను స్టేషన్‌కు పిలిపించి వారివారి సెల్ ఫోన్‌లను అందజేయటం జరిగిందని వారు తెలిపారు.

మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కాచిగూడ: 2022–23వ విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సుల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన మున్నూరుకాపు విద్యార్థినీవిద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్‌రావు తెలిపారు. సోమవారం కాచిగూడలోని మున్నూరు కాపు ట్రస్ట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో అందజేయాలని సూచించారు. వివరాలకు ఫోన్: 040 2465 8160, 94916 27404లలో సంప్రదించాలని కోరారు.

గోమయ ప్రమిదలను ఉపయోగించాలి

నాగోలు: దీపావళి పండుగా సందర్భంగా పర్యావరణ అనుకూల గోమయ ప్రమిదలను అందరూ ఉపయోగించుకోవాలని ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ సిటీస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, బీజేపీ జాతీయ నాయకురాలు కరుణా గోపాల్ వర్తకవి అన్నారు. సోమవారం నాగోలులో పర్యావరణ అనుకూల ప్రమిదల తయారీపై ఎకో దివాస్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఇంపాక్ట్ హబ్ భాగస్వామ్యంతో ఈ వర్క్ షాష్ నిర్వహించారు. గోమయ ప్రమిదలపై అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కరుణ గోపాల్



ప్రజాక్షేమం కోరే బీఆర్‌ఎస్‌కే మద్దతు ఇవ్వాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: రాష్ట్రంలోని అన్నిరంగాలలో అభివృద్ధిని ఉరకలెత్తిస్తూ నిత్యం ప్రజాక్షేమం ఆకాంక్షించే బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ఇవ్వాలని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం చంపాపేట డివిజన్ డిఫెన్స్ కాలనీలోని పార్కులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎల్‌బీనగర్‌లో వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ముద్దగోని రామ్మోహన్ గౌడ్, గజ్జెల మధుసూదన్ రెడ్డి, నల్లా రఘుమారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షులు ముడుపు రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

లింగోజీగూడ డివిజన్ టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు ఆయన అనుచరులతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే బీఎన్‌రెడ్డి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రెడ్డి అరవింద రెడ్డి ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు.

గడపగడపకు బీఆర్‌ఎస్ ప్రచారం...

డివిజన్ పరిధిలోని మసీదు గల్లీలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్ళి పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



గడ్డిఅన్నారం డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీగౌడ్

ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని కరెప్షన్ ఫ్రీ, కబ్జా ఫ్రీగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్‌లోని కాలనీలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. అక్రమ సంపాదనకు ఆశపడి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలని ఓటర్లను ఆయన కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మాజీ కౌన్సిలర్ బద్దుల వెంకటేశ్ యాదవ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేణుకుమార్ యాదవ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తీక్, మహిళానాయకులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

యువత మద్దతు బీజేపీకే..



సలీంనగర్ ప్రచారంలో సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి సోమవారం మూసారంబాగ్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డిలతో కలిసి సలీంనగర్ కాలనీ–1,2, శ్రీపురం కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. ఓటర్లను కలిసి కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. సురేందర్, విజయ్‌కాంత్, దినేష్, మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసి అలా వదిలేశారు..



మన్సూరాబాద్: నాలుగు నెలల క్రితం అట్టహాసంగా రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు... నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు చేపట్టకుండా హయత్‌నగర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో మన్సూరాబాద్ డివిజన్ అమ్మదయ కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి అమ్మదయకాలనీలోని ప్రధాన రోడ్డు గుంతలతో అధ్వాన్నంగా తయారైంది. కాలనీ వాసులు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా మేయర్ ఆదేశాలతో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ రూ.28లక్షల నిధులను మంజూరు చేశారు. జూన్ నెలాఖరున ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో పూర్తికావాల్సిన రోడ్డు పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డు గుంతలమయంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంతంగి శంకర్ పేర్కొన్నారు. హయత్‌నగర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే రోడ్డు పనులు జాప్యం అవుతుందని, ప్రజాప్రతినిధులు చోరవ తీసుకుని రోడ్డు పనులను పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థుల సందడి



హస్తినాపురం: చదువుతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ పై అవగాహన కల్పించి రాబోయే రోజుల్లో వాటి ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తుంచుకోవాలని రోటోమేకర్ వీఎఫ్ఎక్స్ మల్టీనేషనల్ కంపెనీ జనరల్ మేనేజర్ డాక్టర్ సూర్యప్రవీణ్ అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్‌పరిధిలోని అనయ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్స్ ఈ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో అనయ కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థుల సత్తా

బడంగ్‌పేట్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. బడంగ్‌పేట లార్డ్స్ ఒలంపియాడ్ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. పాఠశాలకు చెందిన గోపిక, లిఖిత, లాస్య, మనోజ్‌గౌడ్ గృహ ప్రాంగణంలో చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ అనే అంశాన్ని చక్కగా వివరించి ప్రశంసలు అందుకున్నారు. సోమవారం విద్యార్థులను ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్రీవిద్యకు డాక్టరేట్

బడంగ్‌పేట్: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పుట్టి శ్రీవిద్య గౌరవ డాక్టరేట్ (పీహెచ్‌డీ) అందుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించి వైర్‌లెస్ సెన్సార్ నెట్ వర్క్ సెక్యూరిటీ మెరుగుదలలో కొత్త అల్గారిథలమ్‌లను ప్రతిపాదించారు. ప్రొఫెసర్ ఎల్. నిర్మలాదేవి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి.రవిందర్, అడోబ్ చైర్మన్ శంతను నారాయణ్ చేతుల పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. సకాలంలో పీహెచ్‌డీ పూర్తి చేయడానికి సహకరించిన అధ్యాపకులు, ప్రొఫెసర్లకు బంధువులకు, స్నేహితులకు శ్రీవిద్య ధన్యవాదాలు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో గంజాయి స్వాధీనం

ఉప్పల్: ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు పలుచోట్ల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి పడేసి వెళ్లిపోయినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఐదు కిలోల ఆరు డ్రై గంజాయి ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మరో ఘటనలో హబ్సిగూడ ఎక్స్ రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై నాచారం వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద దాదాపు ఆరు కిలోల గంజాయి ప్యాకెట్లు లభించాయి. వీటితో పాటు హష్ ఆయిల్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు ఈస్ట్ గోదావరి ప్రాంతానికి చెందిన బుర్తి సురేష్(30), అదే ప్రాంతం పారుపాక ఎస్సీపేటకు చెందిన సారిక వరప్రసాద్(33)లుగా గుర్తించారు. వీరు నర్సీపట్నం నుంచి కొనుగోలు చేసి నగరంలో అవసరమైన వారికి విక్రయిస్తుంటారు. ఆరు కిలోల గంజాయి, హష్ ఆయిల్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గెలిచిన మూడునెలల్లో పట్టాలిప్పిస్తా



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ఫతుల్లాగూడ సర్వే నెంబర్ 58లో గెలిచిన మూడు నెలల్లో ప్రతి ఇంటికి పట్టాలు ఇప్పిస్తానని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి హామీ ఇచ్చారు. నాగోలు డివిజన్ పరిధి ఫతుల్లాగూడ సర్వే నెంబర్ –58లోని శ్రీఅభయ హనుమాన్ దేవాలయంలో కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రయాదవ్‌తో కలిసి సామ రంగారెడ్డి సోమవారం పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో ...

మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని వీరభద్రనగర్, భాగ్యనగర్‌కాలనీ, సౌజన్యనగర్, బృందావన్‌కాలనీలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి ఓటేసి గెలిపించాలని సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రజలపక్షాన నిలబడే అభ్యర్థికే మద్దతిస్తాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్‌గౌడ్

ఎల్‌బీనగర్: ప్రజల పక్షాన నిలబడి, ప్రజల కోసం పని చేసే అభ్యర్థికే తమ మద్దతు ఉంటుందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, శ్రీమల్లిఖార్జున భక్త సమాజం రాష్ట్ర అధ్యక్షులు ముద్దగౌని సతీష్‌గౌడ్ తెలిపారు. సోమవారం బీఎన్‌రెడ్డినగర్‌లో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. రాబోయే సాధారణ ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లో ఎవ్వరికి మద్దుతు ఇచ్చేది త్వరలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వెల్లడిస్తామన్నారు. నాయకులు మొగ్గ అనిల్ కుమార్, జగన్మోహన్, వెంకటేశ్, మల్లేష్, మురళీ, బన్సీలాల్, కమలాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి



అక్బర్‌బాగ్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి అజిత్‌రెడ్డి, పార్టీ నాయకులు

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ గెలుపునకు సోపానాలని మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు మంచుకంటి జగన్‌గుప్త, సీనియర్ నేతలు మద్ది శ్రీధర్‌రెడ్డి, తెల్ల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అక్బర్‌బాగ్‌లో చేపట్టిన ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులతో కలిసి ప్రొఫెసర్స్‌కాలనీ, ఆనందనగర్‌లో ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిశారు. తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. నాయకులు మోహన్‌రావు, సరిత, నితేష్, అజేయ్, శ్రీనివాస్, దామోదర్, లక్ష్మి, రాధా, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

మలక్‌పేటలో ఎంఐఎం బైక్ ర్యాలీ



ర్యాలీగా తరలివెళ్తున్న మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల

మలక్‌పేట: నియోజకవర్గ మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల నామినేషన్ సందర్భంగా సోమవారం మలక్‌పేటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓల్డ్‌మలక్‌పేట జలాలుద్దీన్ స్వీటు షాపు నుంచి ప్రారంభమైన ర్యాలీ మసీద్‌లైన్, మటన్ మార్కెట్, రెస్‌కోర్సు రోడ్, రిలయన్స్ మాల్, న్యూమలక్‌పేట మెట్రోస్టేషన్, రైస్‌మిల్స్ చౌరస్తా, అక్బర్‌బాగ్ క్రాస్ రోడ్, దిల్‌ఖుషా ఫంక్షన్ హాల్, గవర్నమెంట్ ప్రెస్ రోడ్, చంచల్‌గూడ, సిటీ ఫంక్షన్ హాల్ లైన్, డబీర్‌పుర‌బ్రిడ్జి, ఆజంపుర చమాన్ క్రాస్ రోడ్, చాదర్‌ఘాట్ మీదుగా నల్లగొండ క్రాస్‌రోడ్ వరకు ర్యాలీ కొనసాగింది. డివిజన్ల వారీగా బలాలకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, అబ్దుల్ సలామ్ షాహిద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దాం

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి అన్నారు. 4వ డివిజన్ పరిధిలో నిర్వహించిన గడప గడప కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజల్లో తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు.